క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



మాజీ సీఎం జగన్‌ను కలిసిన చింతలపూడి నాయకులు

చింతలపూడి: వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చిలుకూరి జ్ఞానారెడ్డి, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కనమత రెడ్డి చండీప్రియ గురువారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ధీటుగా ఎదుర్కోవాలని అధినేత జగన్ సూచించినట్టు జ్ఞానారెడ్డి తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు



ఆలయానికి విరాళం అందిస్తున్న భక్తులు

కొయ్యలగూడెం: కన్నాయిగూడెం గ్రామంలో చేపట్టిన శ్రీగోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి, ఏకలింగేశ్వర స్వామి సహిత ధ్వజస్తంభం ఆలయ నిర్మాణానికి కొయ్యలగూడెంలో గురువారం ఆలయ కమిటీ సభ్యులు విరాళా సేకరించారు. శరణేశ్వర ఏజెన్సీ ప్రొప్రైటర్ మాలి భవర్ లాల్ రూ.41 వేలు, రాందేవ్ ప్లేవుడ్ హార్డ్‌వేర్ షాప్ రూ.51 వేలు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు మంతెన సోమరాజు రూ.5 వేలు, బీజేపీ మండల అధ్యక్షుడు గొలిశెట్టి వాసు రూ.5 వేలు అందజేశారని కమిటీ సభ్యులు తెలిపారు.

రామావతారంలో జగన్నాథుడు



రామావతారంలో జగన్నాథుడు

ద్వారకాతిరుమల: పితృవాక్య పరిపాలనతో మానవుడు ఎంత నీతివంతునిగా జీవించవచ్చో తెలియజేసింది రామావతారం. అట్టి రామావతారంలో జగన్నాథుడు శ్రీవారి క్షేత్ర దత్తత ఆలయమైన లక్ష్మీపురం ఆలయంలో గురువారం దర్శనమివ్వడం భక్తులను అలరించింది. ధనుర్బాణాలను ధరించి సీతా దేవితో కొలువైన స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

దత్తాత్రేయునికి పూజలు



జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం అయ్యప్పస్వామి ఆలయంలో కొలువైన దత్తాత్రేయునికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.


ఘనంగా మెకానిక్స్ డే



మెకానిక్ వర్కర్స్ యూనియన్ సభ్యులు

కామవరపుకోట: స్థానిక శ్రీ వీరభద్ర టు వీలర్స్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెకానిక్స్ డేను వేడుకగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ద్విచక్ర వాహన రూపకర్త గాట్లిప్ డైమ్లెర్ జయంతి రోజున ప్రపంచ మెకానిక్స్ డేగా నిర్వహిస్తున్నట్టు అధ్యక్ష కార్యదర్శులు తమ్మిశెట్టి రమేష్, కొక్కొండ శ్రీను పేర్కొన్నారు. మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అసోసియేషన్ సభ్యులంతా ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. యూనియన్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

బాధిత కుటుంబానికి వితరణ



నూకరాజు కుటుంబానికి సహాయాన్ని అందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మ గుడి ఎదురుగా ఉంటున్న దెయ్యాల నూకరాజు కుటుంబానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ స్థానిక అధ్యక్షులు అల్లూరి రామకృష్ణ ఆధ్వర్యంలో రూ.10,500 సాయం గురువారం అందజేశారు. నూకరాజు అనారోగ్యంతో ఆకస్మిక మృతిచెందారు. కార్యక్రమాలు మండల చైర్మన్ ఆకుల ధర్మరాజు, మానవతా మూర్తి, త్రిపుర రమేష్, ఇమ్మంది మాధవరావు, గంధం గోపాలకృష్ణ, గద్దె సత్యనారాయణ పాల్గొన్నారు.

వీడని వర్షం.. రోడ్లు ఛిద్రం

- గోతుల్లో నిలిచిన నీరు
- రాకపోకలకు ప్రజల ఇబ్బందులు

చింతలపూడి : అల్ప పీడనం ప్రభావంతో మెట్ట ప్రాంతంలో వారం రోజుల నుంచి ఎడతెరపి లేకుండ వానలు పడుతున్నాయి. రోడ్లపైకి నీరు చేరి అవి ఛిద్రంగా తయారవుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక గోతుల్లో డస్ట్ పోసి మరమ్మతులు చేశారు. పోసిన ఆరు నెలలకే మళ్లీ గోతులు పడటంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చింతలపూడి, గురుభట్ల గూడెం రోడ్డు, చింతలపూడి మెయిన్ రోడ్డు, చింతలపూడి సీతానగరం రోడ్డు, ఏలూరు చింతలపూడి ప్రధాన రహదారితో పాటు రాజుపోతేపల్లి అడ్డ రోడ్డు నుంచి కామవరపుకోట, ఏలూరు, జంగారెడ్డిగూడెం రహదారులు పలు ప్రాంతాల్లో గోతులు ఏర్పడి ప్రమాదకరంగా



పొట్టి శ్రీరాములు విగ్రహం సమీపంలో దెబ్బతిన్న మెయిన్‌రోడ్డు

మారాయి. సరైన డ్రెయినేజీ సదుపాయం లేకపోవడం, కొద్దిపాటి వర్షాలకు కూడా రోడ్లు బురదమయంగా మారి వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షం నీరు బయటికి పోయే అవకాశం లేక రోడ్లపైనే మోకాల్లోతు నీరు నిలిచిపోతుంది. ఏది గొయ్యో, ఏది గొప్పో గుర్తించేలోపే వాహనచోదకులు జారిపడుతున్నారు. వర్షాలకు దెబ్బతిన్న రహదారులను తక్షణం మరమ్మతులు చేయించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులను ప్రజలు కోరుతున్నారు.

చిత్తడిగా రహదారులు

ప్రధాన రహదారులే కాక వర్షాలకు గ్రామీణ రహదారులు సైతం అధ్వానంగా మారాయి. చిన్నపాటి వర్షాలకే రోడ్లు చిత్తడిగా మారాయి. చినుకు పడితే కనీసం నడవడానికి కూడా అవకాశం లేకుండా ఉన్నాయి. చింతలపూడి వూరుతీనగర్, ఎస్‌వీఎస్ కాలనీ, ఆంధోని నగర్, గణేష్ కాలనీ, ఛార్లెస్ నగర్ వెళ్లే రహదారులు బురదమయంగా మారాయి. ఎన్ని ప్రణాళికలు పూర్తయినా గ్రామీణ రహదారుల అభివృద్ధి జరగడంలేదు. రోడ్ల దుస్థితిపై అధికారులు స్పందించాలని గ్రామీణులు కోరుతున్నారు.



రత్నా కాంప్లెక్స్ వద్ద ధ్వంసమైన మెయిన్ రోడ్డు



చింతలపూడి మేడబడి వద్ద ప్రమాదకరంగా ఉన్న రహదారి



చింతలపూడి పట్టణంలో తటాకాన్ని తలపిస్తున్న రోడ్డు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కామవరపుకోట: లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు పనుల నిమిత్తం కళ్లచెరువు, సాగిపాడు సబ్ స్టేషన్ల పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

టి.నరసాపురం మండలంలో..

టి.నరసాపురం: టి.నరసాపురం, తిరుమలదేవిపేట, మక్కినవారిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల నిర్వహణ నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు.

చింతలపూడిలో..

చింతలపూడి : స్థానిక సీతానగరం, రేచర్ల, వెలగలపల్లి సబ్ స్టేషన్లకు శుక్రవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు, కొవ్వూరు గూడెం, పాతచింతలపూడి, సమ్మెటవారి గూడెం, మోడల్ కాలనీ, వెలమపేట, ఫైర్ స్టేషన్ సెంటర్, బోయగూడెం ఏరియాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, రాఘవపురం, ఎండపల్లి,గుళ్లపాడు, మల్లేశ్వరం, శివాపురం, పోతునూరు, మల్లాయగూడెం గ్రామల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు.

జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం: స్థానిక కొవ్వూరు రోడ్డు, బుట్టాయగూడెం రోడ్డు, ఇంద్రజిత్ నగర్, పాత పంచాయతీ ఆఫీస్ ఏరియాలు, హరిజనపేట, జేహెచ్ కాలనీ, లక్కవరం ఏరియాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

మెరుగైన సేవలు అందించే వారికి గుర్తింపు

ద్వారకాతిరుమల: ప్రజలకు మెరుగైన సేవలందించే పోలీసులకు గుర్తింపు లభిస్తుందని భీమడోలు సీఐ యుజే విల్సన్ అన్నారు. భీమడోలు సర్కిల్ పరిధిలోని సిబ్బంది ద్వారకాతిరుమల నుంచి చేబ్రోలుకు ఎస్ రాంపండు, భీమడోలుకు ఎస్ మురళీకృష్ణ, కె.జ్యోతి, గణపవరంకు వైవీపీఎస్ నారాయణ, భీమడోలు స్టేషన్ నుంచి నిడమర్రుకు ఎస్ అంజిబాబు, చేబ్రోలుకు పి.రామచంద్రం, దెందులూరుకు కె.రత్నమౌనిక, ద్వారకాతిరుమలకు సీహెచ్ శ్రీనివాసరావులు ఇటీవల బదిలీ అయ్యారు. వీరిని స్థానిక హర్షవనంలో ఘనంగా సత్కరించారు. ఎస్సైలు టి.సుధీర్, వై.సుధాకర్‌లు మాట్లాడారు.

వైఎస్సార్ సీపీ సమావేశానికి తరలిరండి

ద్వారకాతిరుమల: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోనహన్‌రెడ్డి పిలుపు మేరకు బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ శ్రేణులతో ఈనెల 5న నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు మాజీ హోం మంత్రి, పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. దేవరపల్లి మండలం యర్నగూడెంలోని ఆర్ఆర్ కల్యాణ మండపంలో 5వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజాలు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని వివరించారు. ద్వారకాతిరుమల, నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.



వనిత, మాజీ మంత్రి

5న బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ సభ

కొయ్యలగూడెం: కూటమి ప్రభుత్వ హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసగిస్తున్నందుకు నిరసనగా ఈనెల 5వ తేదీన నిర్వహించే బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు పిలుపు ఇచ్చారు. గురువారం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మంతెన సోమరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ అధిష్టానం ఆదేశాల మేరకు నిర్వహించే పోలవరం నియోజకవర్గ సమావేశాన్ని కన్నాపురం రోడ్‌లోని సురేష్ ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం నాలుగు గంటలకు ఏర్పాటు చేశామన్నారు. మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అధ్యక్షతన నిర్వహించే కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావుతో సహా రాష్ట్ర నాయకులు హాజరై శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తారన్నారు. జిల్లా అధికార ప్రతినిధి దాసరి విష్ణు, ఎంపీపీ గంజిమాల రామారావు, మేకల అన్నవరం, నూకల రాము, పాముల నాగముని స్వామి, ఎస్‌కే బాజీ, జుంగా బాబ్జి, కంభంపాటి బుజ్జి బాబు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

సంపూర్ణ పారిశుద్ధ్యంతోనే ఆరోగ్యం

కొయ్యలగూడెం: సంపూర్ణ పారిశుద్ధ్యం అమలుతోనే ప్రజలకు పరిపూర్ణమైన ఆరోగ్యం కలుగుతుందని జెడ్పీ సీఈఓ ఎం శ్రీహరి పేర్కొన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన ఎంపీడీఓ కె.కరుణ్ కుమార్‌తో కలిసి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. మొక్కల పెంపకం ప్రతి పౌరుడూ బాధ్యతగా స్వీకరించాలన్నారు. ఎంపీడీఓ కె.కిరణ్‌కుమార్ అందజేసిన మొక్కలను గ్రామ కూడళ్లు, సచివాలయాల వద్ద నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. బయ్యన్నగూడెం, సీతంపేట పంచాయతీల్లో శానిటేషన్ సిబ్బందితో సమావేశాలు నిర్వహించి వర్షాకాలంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమైందని తెలిపారు. ఇంటింటికీ నిర్వహిస్తున్న చెత్త సేకరణ గురించి ఇళ్ల వద్దకు వెళ్లి ప్రజల నుంచి ఆరా తీశారు. సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సీతంపేటలో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభిస్తున్న జెడ్పీ సీఈఓ

వైఎస్సార్ సీపీ మండలాల అధ్యక్షులు వీరే

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ మండలాల నూతన అధ్యక్షులను నియమిస్తూ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. పార్టీ జంగారెడ్డిగూడెం పట్టణ అధ్యక్షుడిగా కర్పూరం గవరయ్య గుప్తా (నాని), జంగారెడ్డిగూడెం మండల అధ్యక్షుడిగా ఓరుగంటి నాగేంద్ర నియమితులయ్యారు. ఈ సందర్భంగా అధినేత జగన్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. వీరి నియామకంపై పట్టణ, మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

చింతలపూడి అధ్యక్షుడిగా నాగు

చింతలపూడి : వైఎస్సార్ సీపీ చింతలపూడి పట్టణ అధ్యక్షుడిగా కొప్పుల నాగేశ్వరరావు (నాగు)ను నియమించారు. ఆయన ఆరేళ్లగా పార్టీ పట్టణ కన్వీనర్‌గా పని చేస్తున్నారు. నాగు నియామకం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



కర్పూరం గవరయ్య గుప్తా (నాని)



ఓరుగంటి నాగేంద్ర



కొప్పుల నాగేశ్వరరావు



రాయంకుల సత్యనారాయణ



అన్నపనేని శాంతారావు

కె.కోట అధ్యక్షుడిగా సత్యనారాయణ

కామవరపుకోట: వైఎస్సార్ సీపీ మండలం అధ్యక్షుడిగా రామన్నపాలెం గ్రామానికి చెందిన రాయంకుల సత్యనారాయణ నియమితులయ్యారు. ఆయన అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి, జిల్లా నాయకులు దూలం నాగేశ్వరరావు, కారుమూరి సునీల్‌కుమార్, కోటగిరి శ్రీధర్‌కు, కంభం విజయరావులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

లింగపాలెం అధ్యక్షుడిగా శాంతారావు

లింగపాలెం: వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడిగా అన్నపనేని శాంతారావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా శాంతారావు పార్టీ అధినేత జగన్ మోహన్‌రెడ్డికి, రీజనల్ కో ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, ఏలూరు జిల్లా నాయకులు దూలం నాగేశ్వరరావు, కంభం విజయరాజు, కోటగిరి శ్రీధర్, భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి (బీవీఎస్ రెడ్డి), కారూమూరి సునీల్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే బాలరాజు పరామర్శ

బుట్టాయగూడెం: మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు గురువారం అనారోగ్యంతో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు తెల్లం చిన్నారావును పరామర్శించారు. ఆయన ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. చిన్నారావుకు మరో ఆపరేషన్ చేయాల్సి ఉండడంతో రూ.10,000 సాయం బాలరాజు అందజేశారు. అధైర్యపడవద్దని చిన్నారావుకు ధైర్యం చెప్పారు. కొయ్యలగూడెం యూత్ నాయకులు నూకల రాము, తదితరులు పాల్గొన్నారు. దొరమామిడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త సత్యవతి మృతి చెందడంతో ఆమె ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను బాలరాజు పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. దొరమామిడికి చెందిన బోడా సుబ్బారావు మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులను కూడా పరామర్శించారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



చిన్నారావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు, తదితరులు

క్రైం కార్నర్

వ్యాపారులపై ఐదుగురు వ్యక్తుల దాడి

ద్వారకాతిరుమల: బస్‌లు కొనుగోలు చేసేందుకు బేకరీకి వెళ్లిన ఇద్దరు వ్యక్తులు, ఆ వ్యాపారితో గొడవ పెట్టుకుని తమ అనుచరులతో కలసి ఆ వ్యాపారిపైన, అడ్డు వచ్చిన మరో ఇద్దరు వ్యాపారులపైన దాడి చేసి, బేకరీని ధ్వంసం చేశారు. ఈ ఘటనపై బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. వారి కథనం ప్రకారం మండలంలోని గుణ్ణంపల్లికి చెందిన కె.దుర్గా వరప్రసాద్ అదే గ్రామంలోని జాతీయ రహదారి పక్కన కోవా, బేకరీ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. అయితే నల్లజర్ల మండలం ఘంటావారిగూడెంకు చెందిన ఎం.రాము, బోరుగడ్డ లవ్ కుమార్ మద్యం సేవించి దుర్గా వరప్రసాద్ బేకరీకి వెళ్లారు. రెండు బస్‌లు కావాలని అడుగ్గా ఒక బస్ ఇచ్చి, మరో బస్ ఇస్తుండగా రెండు ఇవ్వమంటే ఒకటి ఇస్తావేంటని గొడవ పెట్టుకున్నారు. అంతటితో ఆగకుండా తమ అనుచరులైన భీమడోలు మండలం కురెళ్లగూడేనికి చెందిన పి.బాబి, ఘంటావారిగూడేనికి చెందిన బి.అంజి, బి.నానికి ఫోన్ చేసి బేకరీ వద్దకు రప్పించారు. అనంతరం ఐదుగురు కలసి దుకాణాన్ని ధ్వంసం చేశారు. అలాగే దుర్గా వరప్రసాద్‌పై దాడి చేసేందుకు యత్నించగా, పక్కనే వేరువేరు వ్యాపారాలు నిర్వహిస్తున్న గుణ్ణంపల్లికి చెందిన కె.రాఘవ, ఏలూరుకు చెందిన డీఎస్‌వీ తేజేశ్వరరావులు అడ్డువెళ్లారు. ఈ క్రమంలో వారిద్దరిపై కూడా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. తేజేశ్వరరావు మెడలోని బంగారు గొలుసును లాక్కెళిపోయారు. స్థానికులు వెంటనే స్పందించి బాధితులను ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

ద్వారకాతిరుమల: స్థానిక నిమ్మకాయల మార్కెట్ యార్డు వద్ద గురువారం జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాలు పాలయ్యారు. మండలంలోని గుణ్ణంపల్లికి చెందిన కేఎస్ రెడ్డి నారాయణ, ఎస్‌కే బాజీలు బైక్‌పై ద్వారకాతిరుమలకు వెళుతున్నారు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి బైక్ ఒక్కసారిగా రోడ్డుపై ఉన్న గుంతలో పడింది. దీంతో కింద పడిపోయిన వారిద్దరూ స్థానిక పీహెచ్‌సీకి చేరుకుని చికిత్స పొందారు.

బెల్లపు ఊట ధ్వంసం

జంగారెడ్డిగూడెం: స్థానిక సర్కిల్ పరిధిలోని కుక్కునూరు మండలం వెంకటాపురం గ్రామ శివారులో ఉన్న పెద్దవాగు ఒడ్డున సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 250 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, వ్యక్తిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో రికార్డుల తనిఖీ

జంగారెడ్డిగూడెం: మండలంలోని లక్కవరం పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ యు.రవిచంద్ర గురువారం సందర్శించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల ఫైల్స్, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా మెలగాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో గస్తీ పెంచాలని, డయల్ 112 ఫిర్యాదుపై వేగంగా స్పందించాలని అన్నారు. తొలుత ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. సీఐ ఎంవీ సుభాష్, ఎస్సై శశాంక పాల్గొన్నారు.

ఘనంగా క్రైస్తవ దినోత్సవం

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన గుళ్లపూడి చర్చిలో గురువారం భారత క్రైస్తవ దినోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ జాతీయ ఐక్య వేదిక ప్రెసిడెంట్ జి.ఫిలిప్, జాతీయ ఐక్యవేదిన సలహాదారు ఎం జోసఫ్‌లు మాట్లాడుతూ క్రీస్తు బోధనలైన త్యాగం, ప్రేమ, జాలి, ప్రతిఒక్కరూ కలిగి ఉండాలన్నారు. భారతదేశంలో మొదటిగా క్రీస్తు బోధనలను పరిచయం చేసిన వ్యక్తి సెయింట్ థామస్ అని గుర్తుచేశారు. క్రైస్తవ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో జాతీయ ఆదివాసీ ఐక్యవేదిక ప్రతినిధులు ఎం పీటర్, కె.సియోన్ కుమార్, ఎస్ ఇస్సాకు, సీహెచ్ డానియేలు, జి.యేసేపు, కె.రాజు, కె.సీయోన్ కుమార్, పి.కాలేబు, పి.దావీదు, పి.కొర్నేలు, సంఘ విశ్వాసులు, తదితరులు పాల్గొన్నారు.



గుళ్లపూడిలో ప్రార్థన చేస్తున్న దృశ్యం

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ద్వారకాతిరుమల: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆ పార్టీ రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు జక్కంపూడి రాజా సూచించారు. వైఎస్సార్ సీపీ ద్వారకాతిరుమల మండల అధ్యక్షుడు ప్రతాపనేని వాసు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దాసరి రాంబాబు, భోగరాజు సాయి కృష్ణలు గురువారం రాజాను రాజమహేంద్రవరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసారు. రాజాకు దుశ్శాలువాను కప్పి, చినవెంకన్న మెమెంటోను అందజేశారు. గోపాలపురం నియోజకవర్గం ద్వారకాతిరుమల మండలంలో రాజకీయ పరిస్థితులను రాజకు వివరించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో నోటికొచ్చిన హామీలిచ్చి, ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని రాజా విమర్శించారు. కూటమి మోసాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు.



రాజాకు శ్రీవారి మెమెంటో అందజేస్తున్న వాసు, జ్యోతి శ్రీనివాస్

కొనసాగుతున్న కార్మికుల సమ్మె

జంగారెడ్డిగూడెం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేప్టిన సమ్మె గురువారం నాలుగో రోజుకు చేరింది. ఈ సమ్మెకు ఏఐటీయూసీ నాయకులు కె.విగ్నేష్, శానిటేషన్ ఏఐటీయూసీ యూనియన్ సభ్యులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా విగ్నేష్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు ఏఐటీయూసీ అండగా ఉంటుందన్నారు.

రంగా జయంతికి ఏర్పాట్లు

కొయ్యలగూడెం: వంగవీటి మోహన రంగా 78వ జయంతి కార్యక్రమం కొయ్యలగూడెంలోని యూనియన్ బ్యాంకు ఎదుట ఉన్న రంగా విగ్రహం వద్ద నిర్వహిస్తున్నట్లు రంగా అభిమానులు తెలిపారు. రంగా విగ్రహం చుట్టూ రైలింగ్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

బుట్టాయగూడెం: కార్మిక, ఉద్యోగ, రైతు సమస్యలపై ఈ నెల 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కేవీ రమణ కోరారు. మండలంలోని కేఆర్‌పురం సివిల్‌సప్లై గిరిజన కార్పొరేషన్ హమాలీల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వర్గానికి కనీసవేతనం రూ. 20 వేలు ఇవ్వాలని కోరారు. నాయకులు కత్తుల రాజేష్, కోర్సా కిశోర్, కొవ్వాసు సాయి, కోర్సా రవి, దేవరపల్లి రాజు పాల్గొన్నారు.

6న కుక్కలకు రేబీస్ టీకాలు

ఏలూరు (టూటౌన్): ప్రపంచ అంటు వ్యాధుల దినోత్సవం (జునోసిస్ డే) సందర్భంగా ఈనెల 6న ఆదివారం కుక్కలకు రేబీస్ టీకాలు ఉచితంగా వేయనున్నట్టు పశు సంవర్ధశాఖ సహాయ సంచాలకులు పి.సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియం వెనుక ఉన్న పశుసంవర్ధక శాఖ కార్యాలయ ఆవరణలో ఉన్న పశువైద్యశాలలో రేబీస్ టీకాలు వేస్తామని, ఏలూరు నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లోని పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా టీకాలు వేయించాల్సిందిగా కోరారు.